ఏపీ అక్రమ ప్రాజెక్టులపై ఆది నుంచీ యుద్ధమే

పదేండ్లుగా పోరాడిన బీఆర్ఎస్ ప్రభుత్వం

- 'విభజన చట్టం'లోని నీటి కేటాయింపుల అన్యాయాలపై గళ మెత్తింది బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావే

- **2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కొత్త ట్రిబ్యునల్ కోసం కేసీఆర్ అలుపెరుగని పోరాటం**
- **ఏపీ అక్రమ ప్రాజెక్టులపై 2017 నుంచే కేంద్రానికి లేఖలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): కొందరు కండ్లుండీ చూడలేరు.. వాస్తవం తెలిసినా నిజం మాట్లాడరు.. తెలంగాణకు నీటి కేటాయింపులపై ఒక పత్రిక రాసిన కథనం అచ్చం ఇలాంటిదే. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తలకెత్తుకున్న నాడు ఇచ్చిన నినాదమే 'నీళ్లు, నిధులు, నియామకాలు'. ఈ మూడింటికీ మొదటినుంచి ఇప్పటివరకు ఆయన కట్టుబడే ఉన్నారు. తెలంగాణకు నీటి కేటాయింపుల్లో జరుగుతున్న అన్యాయాలపై తొలి నుంచీ గొంతెత్తుతూనే ఉన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా జలవనరుల్లో తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రంపై పోరాటం చేస్తూనే ఉన్నారు. అయినా ఆ పత్రిక మాత్రం శుద్ధ అసత్యాలను వండివార్చింది. సాధారణంగా పొరుగు రాష్ట్రం అక్రమంగా సాగునీటి ప్రాజెక్టులు కడుతుంటే.. ప్రభుత్వపరంగా.. కేంద్ర ప్రభుత్వంతోపాటు బోర్డుల దృష్టికి తీసుకెళ్లడం, న్యాయస్థానాలను ఆశ్రయించడం, ఇతర వేదికల ద్వారా కేంద్రంపై ఒత్తిడి తేవడం అనే మార్గాలు ఉంటాయి. కేసీఆర్ ప్రభుత్వం గత పదేండ్లలో ఈ మూడు ప్రయత్నాలను అత్యంత సమర్థంగా నిర్వహించింది. ఏపీ అక్రమ ప్రాజెక్టులను కేంద్ర జల్‌శక్తి శాఖతోపాటు కేఆర్ఎంబీ దృష్టికి పదే పదే తీసుకెళ్లింది. మరోవైపు న్యాయస్థానాలు, ఎన్జీటీని ఆశ్రయించింది. అపెక్స్ కౌన్సిల్ సమావేశం, పీఎంవో రివ్యూలు, ఇతర వేదికల ద్వారా ఏపీ అక్రమాలను నిలువరించేందుకు విశ్వప్రయత్నాలు చేసింది.

చంద్రబాబు కాలం నుంచే అక్రమ ప్రాజెక్టులపై పోరు

ఆ పత్రిక రాసిన కథనంలో ఏపీలో అక్రమ ప్రాజెక్టులు 2019 నుంచే మొదలైనట్టు, తామేదో ప్రభుత్వానికి సూచనలు చేసినట్టు, అయినా పట్టించుకోలేదన్నట్టు వండి వార్చింది. కానీ, ఏపీలో నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులపై కేసీఆర్ ప్రభుత్వం 2017 నుంచే పోరాటం చేసింది. అప్పటినుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలన్నింటినీ పక్కదారి పట్టించి, వాస్తవాలు తొక్కిపెట్టి, బట్టకాల్చి మీదవేసినట్టు పచ్చి అబద్ధాలు రాసింది.

2017లో తెలంగాణ సీఎస్ లేఖ

- చంద్రబాబు హయాంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నదిపై ప్రాజెక్టులు ప్రతిపాదించింది. దీంతో విభజన చట్టాన్ని ఉల్లంఘించి ఏపీ అక్రమంగా పది ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నదంటూ 2017 జూలై 29న నాటి నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శికి ప్రత్యేకంగా లేఖ రాశారు. పట్టిసీమ, పురుషోత్తమపట్నం, ముచ్చుమర్రి, సిద్ధాపురం, శివ భాష్యం, గుండ్రేవుల, మున్నేరు కొత్త ఆనకట్ట, గురు రాఘవేంద్ర, గాజులదిన్నె, పులికనుమల కింద చేపడుతున్న కొత్త పథకాలకు ఎలాంటి కేటాయింపులు, అనుమతులు లేవని అందులో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు అపెక్స్ కౌన్సిల్ నుంచి అనుమతి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు.

2020లో కేంద్రానికి కేసీఆర్ లేఖ

- 2020 అక్టోబర్ 2న అప్పటి సీఎం కేసీఆర్ కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు 14 పేజీల లేఖ రాశారు. ఇందులో నీటి కేటాయింపులు, ప్రాజెక్టులతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు నిలువరించడం లేదని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు నుంచి అక్రమంగా నీటిని తరలిస్తుంటే కేఆర్ఎంబీ ఏం చేస్తున్నదని నిలదీశారు.

2020లో కేఆర్ఎంబీకి ఫిర్యాదు

- 2020 ఆగస్టు 5న అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌కు ఉద్దేశపూర్వకంగానే హాజరు కాలేదని, అందుకే రాయలసీమ లిఫ్ట్‌కు టెండర్లు జరిగాయని అడ్డగోలు రాతలు రాశారు. క్యాబినెట్ సమావేశం ఉండటం వల్ల అపెక్స్ కమిటీ మీటింగ్‌కు హాజరు కాలేనని నాడు కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. అంతేకాదు, ఏపీ ప్రభుత్వం 2020 మే నెలలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టేందుకు ఏర్పాట్లు ప్రారంభించింది. వెంటనే కేసీఆర్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసింది. పనులను ఆపేయాలని తీవ్రంగా వాదించింది. దీంతో పనులను ఎక్కడికక్కడే ఆపేయాలని 2020 జూలై 31న కేఆర్ఎంబీ ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీడబ్ల్యూసీ అనుమతులు వచ్చేదాకా ఎలాంటి పనులు చేపట్టవద్దని స్పష్టం చేసింది. అంటే అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌కు ఐదు రోజుల ముందే కేఆర్ఎంబీ ఆదేశాలు జారీ చేసింది. అయినా ఏపీ ఆగలేదు. టెండర్ల ప్రక్రియ కొనసాగించింది. దీంతో ఏపీ ప్రభుత్వం దుశ్చర్యలపై ఆగస్టు 5న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వెంటనే టెండర్ల ప్రక్రియను రద్దు చేయాలని కోరింది. ఒకవేళ కేసీఆర్ ప్రభుత్వం ఏపీకి అనుకూలంగా వ్యవహరించాలనుకుంటే కేఆర్ఎంబీకి ఎందుకు ఫిర్యాదు చేస్తుంది? సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్తుంది? అనేవి కీలక ప్రశ్నలు.

గ్రీన్‌ట్రిబ్యునల్‌లో బలమైన వాదనలు

- రాయలసీమ లిఫ్ట్‌పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా తెలంగాణ బలంగా వాదనలు వినిపించింది. కేఆర్ఎంబీ నామమాత్రంగా ఉన్నదని, పనులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని, కనీసం ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించడం లేదని వాదించింది. దీంతో ఒక దశలో ఎన్జీటీ ఏపీ ప్రభుత్వం, కేఆర్ఎంబీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏపీ సీఎస్‌ను జైల్లో పెడుతామని 2021 జూన్ 26న హెచ్చరించింది. వెంటనే కేఆర్ఎంబీ అధికారులు వెళ్లి పనులు పరిశీలించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో అవసరమైతే తామే హెలికాప్టర్ ఇచ్చి మరీ పంపుతామని కేసీఆర్ ప్రభుత్వం ఎన్జీటీకి చెప్పింది. అవసరమైన రక్షణ కూడా కల్పిస్తామని హామీ ఇచ్చింది. కేసీఆర్ ఒకవేళ జగన్‌తో రాజీ పడితే ఇవన్నీ ఎందుకు జరుగుతాయని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

సీఎంల భేటీపై వింత భాష్యం

పొరుగు రాష్ట్రంతో జల జగడాలు భవిష్యత్‌లో తీవ్ర నష్టం కలిగిస్తాయని నాటి సీఎం కేసీఆర్ భావించారు. అందుకే పొరుగు రాష్ట్రాలతో సఖ్యత కోసం ప్రయత్నించారు. కాళేశ్వరం నిర్మాణంలోనూ స్వయంగా మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరిపి, ముంపు ప్రాంత సమస్యకు ముగింపు పలికారు. ఇదే తరహాలో ఏపీతోనూ జలజగడానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో గోదావరి నుంచి వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆలోచించారు. ఇందుకోసం గోదావరి, కృష్ణా నదుల అనుసంధానాన్ని ప్రతిపాదించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానించి ఈ అంశంపై చర్చలు జరిపారు. గోదావరి జలాలను శ్రీశైలం ప్రాజెక్టుకు తరలించాలన్న ప్రతిపాదనపై మొదటి సమావేశంలో ఇద్దరు సీఎంలు సూత్రప్రాయ అంగీకారానికి వచ్చారు. ఈ సందర్భంగానే 'నీళ్ల విషయంలో భేషజాలు లేవు' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత నదుల అనుసంధానానికి అయ్యే ఖర్చులో చెరో 25%, కేంద్రం నుంచి మిగతా 50% నిధులు సేకరించాలని భావించారు. ఆ తర్వాత ఏపీ, తెలంగాణ ఇంజినీర్లు నీటి తరలింపుపై దాదాపు 5 ప్రతిపాదనలు ఇచ్చారు. వీటిపై మరో సమావేశంలో ఇద్దరు సీఎంలు చర్చించారు. ఇదే సమయంలో చంద్రబాబునాయుడు రంగప్రవేశం చేసి నదుల అనుసంధానంతో నాగార్జునసాగర్ నీటిని తెలంగాణ దోచుకుంటుందని దుష్ప్రచారం మొదలుపెట్టారు. దీంతో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వెనక్కి తగ్గారు. వేరే సంస్థతో సర్వే చేయించుకొని, పోలవరం నుంచి శ్రీశైలానికి నీళ్లు తీసుకెళ్తామంటూ ప్రకటించారు. దీంతో ఇరువురు సీఎంల సమావేశాలు అర్థంతరంగా ముగిశాయి. ఈ వాస్తవాలు ఆ పత్రికతోపాటు ప్రపంచం మొత్తానికి తెలుసు. అయినా వీటిని దాచిపెట్టి బట్టకాల్చి మీద వేసేలా రోత రాతలు రాసింది.

'జల'దోపిడీకి అడ్డుగా దశాబ్దకాలం

రాష్ట్ర విభజన సమయంలోనే తెలంగాణకు నదీజలాల కేటాయింపుల్లో అన్యాయం జరిగింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటిరోజు నుంచి రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటా గురించి ఒకవైపు కేంద్ర ప్రభుత్వం దగ్గర, మరోవైపు నదీయాజమాన్య బోర్డుల దగ్గర, ఇంకోవైపు కోర్టుల్లో పోరాటం చేశారు. రాయలసీమ లిఫ్ట్ విషయంలో ఏపీ సీఎంతో రాజీపడ్డారని చెప్పడం అత్యంత దుర్మార్గం. ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులు చేపట్టిన వెంటనే కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. దీంతో పనులు ఆపేయాలని 2020 జూలైలోనే బోర్డు ఏపీని ఆదేశించింది. ఒకవేళ కేసీఆర్ రాజీ పడితే ఆగస్టు 5న అపెక్స్ కౌన్సిల్ సమావేశం కన్నా ముందే ఆదేశాలు ఎలా వస్తాయి? ఆగస్టు 5న ఏపీపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కూడా ఫిర్యాదు చేసింది. ఎన్జీటీలోనూ బలమైన వాదనలు వినిపించింది. ఒక ప్రాజెక్టును అడ్డుకోవడానికి ఏయే వేదికల ద్వారా పోరాడవచ్చో అన్నివైపుల నుంచి కేసీఆర్ ప్రభుత్వం ఒత్తిడి చేసింది. కానీ కేంద్రం సహకరించకపోవడం, ఏపీ మొండివైఖరి వల్ల ఈ పరిస్థితి వచ్చింది. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డితో నదుల అనుసంధానంపై చర్చలు జరిగితే, దానికి కూడా అపార్థాలు అంటగట్టి కథనాలు రాయడం అన్యాయం.

- వీ ప్రకాశ్, జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్

కాంగ్రెస్ దగా.. కేసీఆర్ ఉద్యమం

రాష్ట్రాలు విడిపోయినప్పుడు నదీ పరివాహక ప్రాంత విస్తీర్ణం, భౌగోళిక, వాతావరణం తదితర అంశాల ప్రాతిపదికన నదీ జలాల్లో నీటి వాటాను కేటాయిస్తారు. అంతర్జాతీయ జలసూత్రాలు కూడా దీనినే నిర్దేశిస్తున్నాయి. కానీ విభజన సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సూత్రాలను తుంగలో తొక్కింది. అప్పటికే ఆయా రాష్ట్రాల వినియోగంలో ఉన్న నదీ జలాలను మాత్రమే ప్రాజెక్టుల వారీగా పంపిణీ చేయాలని నిర్దేశిస్తూ చట్టంలో సెక్షన్ 89 నిబంధనను పొందుపరిచింది. అప్పటికే కొనసాగుతున్న బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కే ఆ బాధ్యతను అప్పగించింది. రాష్ట్ర జాబితాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టింది. బోర్డులను ఏర్పాటు చేసి, ప్రాజెక్టులు నిర్వహించాలని నిర్దేశించింది. విభజన మాటున కాంగ్రెస్ చేసిన ఈ దగాపై కేసీఆర్ అవిశ్రాంతంగా పోరాడారు. సెక్షన్ 89 ప్రకారం తెలంగాణకు ఒరిగేదేమీ ఉండబోదని, న్యాయమైన నీళ్ల వాటా రాదని తేల్చిచెప్పారు.

> అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం 1956లో సెక్షన్ 3 ప్రకారం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి న్యాయమైన నీటి వాటా తేల్చాలని 2014 జూలై14న కేంద్ర ప్రభ్వునికి వినతిపత్రం అందజేశారు. ఈవిధంగా అధికారంలోకి రాగానే కేంద్రం తలుపు తట్టారు. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తుందనే నమ్మకం రాకపోవడంతో కేసీఆర్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ తర్వాత సైతం కేంద్రానికి అనేక లేఖలు రాసింది. 2020 అక్టోబర్ 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ట్రిబ్యునల్ అంశంపై కేసీఆర్ పట్టుబట్టడంతో కేంద్రం దిగొచ్చింది. ఆ తర్వాత కూడా అనేక మెలికలు పెట్టింది. అయినా పోరాటం కొనసాగించడంతో గత ఏడాది అక్టోబర్‌లో సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ చేపట్టాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు మార్గదర్శకాలను జారీ చేసింది. తద్వారా తెలంగాణకు రావాల్సిన న్యాయమైన నీటివాటా డిమాండ్లను ట్రిబ్యునల్ ఎదుట వినిపించేందుకు అవకాశం లభించింది. తెలంగాణ నీళ్లను ఏపీ దోచుకునేందుకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశం కేసీఆర్‌కే ఉండి ఉంటే సెక్షన్ 3పై ఎందుకు పోరాటం చేస్తారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

కోదాడలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు తుమ్మల, రాజనర్సింహ

ప్రాజెక్టులు అప్పగించలేదు

మరోసారి ప్రకటించిన మంత్రి ఉత్తమ్

కోదాడ, ఫిబ్రవరి 7 : కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించలేదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. బుధవారం కోదాడ పట్టణంలో వంద పడకల దవాఖానకు శంకుస్థాపన చేసిన ఆయన అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కృష్ణా జలాల పంపిణీపై తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణ కంటే ఆంధ్రాకే ఎక్కువ మేలు జరిగిందని తెలిపారు. కేసీఆర్, ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి మధ్య ఉన్న సాన్నిహిత్యంతో కృష్ణా జలాలు ఏపీకి ఎక్కువ వాటా వెళ్తుందని ఆరోపించారు. కృష్ణా జలాల దోపిడీని కేసీఆర్ అరికట్టలేక పోయారని విమర్శించారు. కేసీఆర్ మేడిగడ్డపైనా మాట్లాడాలని డిమాండ్ చేశారు.

సాగునీటి శాఖలో భారీ మార్పులు

I పేజీ తరువాయి...

నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అయితే కేఆర్ఎంబీ అంశాన్ని మరుగున పడేసేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొన్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఒప్పుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి తీవ్ర నిరసన ఎదురవుతున్నది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమైంది. 13వ తేదీన నల్లగొండలో భారీ సభ నిర్వహించి ప్రభుత్వంపై పోరాడాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జంగ్‌సైరన్ మోగించారు. దీంతో ఈ అంశం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకొన్నట్టు భావిస్తున్నారు. వాస్తవానికి మేడిగడ్డ బరాజ్ కుంగినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఈఎన్సీలపై తీవ్ర ఆరోపణలు చేసింది. తాము అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కించింది. తీరా ఇప్పుడు ప్రాజెక్టుల అప్పగింతపై తీవ్ర వ్యతిరేకత వచ్చిన తర్వాత ఈఎన్సీలపై చర్యలు తీసుకున్నట్టు విమర్శలు వస్తున్నాయి.

నేడు పీఎంవో సమావేశం?

తెలంగాణ, పశ్చిమ బెంగాల్ అధికారులతో ప్రధాన మంత్రి కార్యాలయ బృందం గురువారం ఢిల్లీలో భేటీ కానున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాలకు చెందిన అపరిష్కృత సమస్యలపై చర్చించనున్నారు. ఇందులో కేఆర్ఎంబీపైనా చర్చిస్తారని సమాచారం.

పుణెకు అన్నారం బరాజ్ అధికారులు!

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్నారం బరాజ్‌కు సంబంధించి ఇరిగేషన్ అధికారులు స్టడీ టూర్ కోసం మహారాష్ట్రలోని పుణెకు వెళ్లారు. మోడల్ స్టడీస్‌లో భాగంగా ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోని బృందం బుధవారం పుణెలో పర్యటించినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అన్నారం బరాజ్‌కు సంబంధించి డిజైన్ నిపుణులు, ఇరిగేషన్ అధికారులు, కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఏబీ పాండ్యాతో కలిసి వెళ్లారు. అన్నారం బరాజ్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో స్టడీ చేస్తున్నట్టు సమాచారం. ఈ బృందం గురువారం కూడా పుణెలో అధ్యయనం చేయనున్నది.

సీఎం రేవంత్ కనుసన్నల్లోనే..!

I పేజీ తరువాయి...

శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ మురళీధర్‌రావు 'కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు అంగీకారమే' అని స్పష్టం చేశారు. అంటే రేవంత్ సర్కారు ఏం చెప్పిందో ఈఎన్సీ మురళీధర్‌రావు తు.చ. తప్పకుండా అదే చేశారనేది నిర్వివాదాంశం. కాకపోతే ఈ వ్యవహారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా నడిపించారనే ప్రచారం ప్రభుత్వ, పార్టీ వర్గాల్లో జోరందుకున్నది. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సమాచారం లేకుండానే 'ప్రాజెక్టుల అప్పగింత' తతంగం జరిగిపోయిందనే వాదన వినిపిస్తున్నది. ఇందుకు గత నెల రోజుల్లో చోటుచేసుకున్న అనేక పరిణామాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. సర్కారు వైఫల్యాన్ని గుర్తించి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడైతే ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైందో అప్పుడు సీఎం రేవంత్ 'తూచ్' అంటూ మీడియా సమావేశం నిర్వహించినట్టు చెప్తున్నారు.

పది రోజుల తర్వాత కేంద్రానికి లేఖ

కేంద్ర జల్‌శక్తి శాఖ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశాన్ని గత నెల 17వ తేదీన నిర్వహించింది. అందులో ప్రాజెక్టుల అప్పగింతకు తెలంగాణ ప్రభుత్వం (అధికారులు) అంగీకరించిందనే వాస్తవాన్ని మరుసటిరోజే 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. అదే రోజు (18వ తేదీ) కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించి మీడియాకు ఆ వివరాలు వెల్లడించిన సందర్భంగా 'ప్రాజెక్టులను అప్పగించలేదు' అని ముక్తసరిగా తెలిపింది. కానీ ఆ మరుసటి రోజే అంటే 19వ తేదీన కేంద్ర జల్‌శక్తి శాఖ సమావేశ మినిట్స్‌ను అధికారికంగా తెలుగు రాష్ట్రాల ఈఎన్సీలకు పంపింది. లేఖ కూడా బయటికి వచ్చింది. దీంతో అందులోని వాస్తవాల ఆధారంగా తెలంగాణ కృష్ణా ప్రాజెక్టుల కథ ఒడిసిపోయింది అంటూ అన్ని మీడియాల్లో ప్రముఖంగా వచ్చింది. సీఎం, మంత్రులు బుకాయిస్తున్నట్టు 'మేం ఒప్పుకోలేదు' అనేది నిజమైతే వెంటనే అదే రోజు కేంద్రానికి లేఖ వెళ్లాలి. కానీ రేవంత్ ప్రభుత్వం కేంద్రానికి పంపినట్టు చెప్తున్న లేఖ 27వ తేదీన రూపొందించారు. దానిని 29వ తేదీన కేంద్ర జల్‌శక్తి శాఖకు పంపారు. అంటే అధికారికంగా కేంద్రం 'తెలంగాణ ఒప్పుకున్నది' అని మినిట్స్‌లో వెల్లడించిన పది రోజులకుగానీ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదన్నమాట. మరి ఈ ఆలస్యం వెనక మతలబు ఏమిటి?

మంత్రి ఆదేశాలు బేఖాతర్

జనవరి 17న జరిగిన సమావేశానికి కొనసాగింపుగా కేంద్ర జల్‌శక్తిశాఖ ఫిబ్రవరి ఒకటో తేదీన హైదరాబాద్‌లోనే సమావేశం కావాలని కృష్ణా బోర్డుకు సూచించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల ఈఎన్సీలకు గత నెల 30వ తేదీన లేఖ రాసింది. వాస్తవానికి గత పదేండ్లలో కేవలం త్రిసభ్య కమిటీ సమావేశాలు మినహా కృష్ణా బోర్డు, కేంద్ర జల్‌శక్తి శాఖ సమావేశాల్లో ఈఎన్సీలతో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, ఇతర ఇంజినీర్లు కూడా పాల్గొంటారు. తొలిసారి కేవలం ఇద్దరు ఈఎన్సీలతోనే సమావేశాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. కాగా ఈ సమావేశానికి ఒకరోజు ముందు అంటే గత నెల 31వ తేదీన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బోర్డు సమావేశంపై ఈఎన్సీతోపాటు పలువురు అధికారులతో సమావేశమైనట్టు విశ్వసనీయంగా తెలిసింది. 'మీరు సమావేశంలో ఏమీ మాట్లాకుండా... కేంద్ర జల్‌శక్తి శాఖకు గత నెల 27న మనం రాసిన లేఖ ఇచ్చి రండి' అని మంత్రి స్పష్టంగా చెప్పినట్టు సమాచారం. కానీ ఫిబ్రవరి ఒకటో తేదీన జరిగిన సమావేశంలో ఈఎన్సీ మురళీధర్‌రావు గంటల తరబడి 'ఆపరేషన్ ప్రొటోకాల్'పై చర్చించారు. బోర్డు నిర్వహణలో పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన ఈఎన్సీ అందుకు భిన్నంగా ఎందుకు వ్యవహరించారు? మంత్రికంటే పెద్దవారు ఎవరు ఈ మేరకు ఆదేశాలిచ్చారు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈఎన్సీ ఆ పది నిమిషాలు ఎవరితో మాట్లాడారు?

జలసౌధలో ఫిబ్రవరి ఒకటో తేదీన జరిగిన కృష్ణా బోర్డు సమావేశం తర్వాత ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. అనంతరం తెలంగాణ ఈఎన్సీ మురళీధర్‌రావు మాట్లాడకుండా వెళుతుండటంతో మీడియా ఆయన్ని ఆపి, తెలంగాణ తరఫున స్పష్టత ఇవ్వాలని ఒత్తిడి చేసింది. దీంతో ముఖ్య కార్యదర్శితో మాట్లాడి వచ్చి మీడియా బ్రీఫింగ్ ఇస్తానంటూ జలసౌధ రెండో అంతస్తుకు వెళ్లిన ఆయన, తర్వాత వచ్చి మీడియాతో మాట్లాడారు. 'ప్రాజెక్టుల నిర్వహణ, నీటి విడుదల బోర్డు చూసుకుంటుంది. నిర్వహణకు స్టాఫ్ కావాలని బోర్డు అడుగుతున్నది. ఆ మేరకు ఉద్యోగులను కేటాయిస్తాం' అని తెలిపారు. అదేరోజు ఎలక్ట్రానిక్ మీడియా, రెండో తేదీన అన్ని పత్రికల్లోనూ ప్రాజెక్టుల అప్పగింత నిజమేనని ఈఎన్సీ చెప్పినట్టుగానే వచ్చింది. దీంతో రెండో తేదీన నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. మేం ప్రాజెక్టులను అప్పగించేందుకు అంగీకరించలేదు. మీడియానే తప్పుడు ప్రచారం చేస్తున్నదని నిందించారు. మరి.. రాహుల్ బొజ్జా అభిప్రాయం ఇదైతే, ఒకరోజు ముందు రాహుల్ బొజ్జాను కలిసి వచ్చిన తర్వాతనే ఈఎన్సీ మీడియాతో మాట్లాడతానని చెప్పారుకదా? మాట్లాడి వచ్చిన తర్వాతే 'అంతా బోర్డు చూసుకుంటుంది' అన్నారు కదా? అంటే ఈఎన్సీ ఆ రోజు ఆ పది నిమిషాలు ముఖ్య కార్యదర్శితోనే మాట్లాడారా? మాట్లాడితే ఇద్దరూ భిన్న ప్రకటనలు ఎలా చేస్తారు? అసలు ఈఎన్సీ మాట్లాడింది ఎవరితో?

అంతా హడావుడి మినిట్స్

కేంద్ర జల్‌శక్తి శాఖ, కృష్ణా బోర్డు వ్యవహార శైలి కూడా ఈ ఎపిసోడ్‌లో కొంత అనుమానాస్పదంగా ఉన్నదని నిపుణులు అంటున్నారు. గత నెల 17న జరిగిన సమావేశం తర్వాత గతంలో మాదిరిగానైతే 'ముసాయిదా మినిట్స్ కాపీ'ని తెలుగు రాష్ట్రాలకు పంపాలి. రెండు రాష్ట్రాల అధికారులు సదరు సమావేశంలో తాము మాట్లాడిన రీతిన మినిట్స్‌లో ఉన్నదా? అని చూసి, భిన్నంగా ఉంటే అభ్యంతరాలు తెలుపుతూ, వాస్తవాన్ని పొందుపరుస్తూ సమాచారం ఇస్తారు. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాతనే తుది మినిట్స్‌ను జారీ చేయాలి. కానీ అలా జరగలేదు. నేరుగా మినిట్స్‌ను పంపితే దానిపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పేందుకు ఏకంగా పది రోజుల సమయం తీసుకొన్నది. కనీసం ముసాయిదా ఎందుకు పంపలేదని కూడా తెలంగాణ నీటిపారుదలశాఖ నిలదీయలేదు. మరోవైపు కృష్ణా బోర్డు ఇప్పటివరకు అనేక సమావేశాలు నిర్వహిస్తే మినిట్స్ కాపీని నాలుగైదు రోజులకుగానీ విడుదల చేయలేదు. కానీ ఫిబ్రవరి ఒకటో తేదీ సమావేశ మినిట్స్‌ను మరుసటి రోజే హడావుడిగా విడుదల చేయడం కూడా అనుమానాలకు తావిస్తున్నది. ముఖ్యంగా ముందు ముసాయిదా మినిట్స్ పంపాలని తెలంగాణ ఈఎన్సీ బోర్డుకు లేఖ రాసినప్పటికీ, అందుకు భిన్నంగా ఒక్కరోజు వ్యవధిలోనే తుది మినిట్స్ విడుదల చేశారు. ఈ మినిట్స్ వెంటనే విడుదల చేయడం వెనక ఢిల్లీలో పెద్ద హోదాలో ఉన్న ఒక వ్యక్తి బోర్డుపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారనే ప్రచారం కూడా జలసౌధలో చక్కర్లు కొడుతున్నది.

ఈఎన్సీని వెనకేసుకొచ్చిన సీఎం రేవంత్

కృష్ణా బోర్డు వ్యవహారం గత నెల 18వ తేదీ నుంచి రాష్ట్రంలో సంచలనంగా మారుతూ వచ్చింది.